సాక్షి కరీంనగర్

శనివారం | 21 | అక్టోబర్ | 2023

పోలీస్ వీరులారా.. వందనం

ప్రపంచమంతా నిద్రలో ఉంటే.. ఒక్క పోలీసులే మేల్కొని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిత్యం కాపలా కాస్తుంటారు. ఎండ, వాన, పగలు, రాత్రి తేడా లేకుండా పండుగలకు కుటుంబాలతో గడపకుండా విధుల్లో ఉంటారు. ప్రజల రక్షణకు పాటుపడి, అసువులుబాసిన వీరులకు వందనం. వారిని స్మరించుకోవడం మన బాధ్యత. నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



న్యూస్‌రీల్

మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్



కరీంనగర్‌సిటీ: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యాక్-ఏ గ్రేడును సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో సంబరాలు జరుపుకున్నారు. ఈ నెల 9,10 తేదీల్లో న్యాక్ పీర్ టీం కళాశాలను సందర్శించింది. అప్పుడే సదుపాయాలు బాగున్నాయని ప్రశంసించిన న్యాక్ బృందం నివేదికను షీల్డ్‌కవర్‌లో బెంగళూర్‌లోని కార్యాలయానికి అందించింది. న్యాక్ కేంద్ర కార్యాలయం కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటించింది. ఇది ఐదేళ్లపాటు కొనసాగుతుందని మెయిల్ ద్వారా వివరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ బండి సంజయ్ కుమార్, మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు అభినందనలు తెలిపారు. కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ రావడానికి తమవంతు కృషి చేసిన విద్యార్థినులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ ధన్యావాదాలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట సంపత్ కుమార్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డీఎస్.చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ గంద్ర శ్రీధర్‌రావు, సూపరింటెండెంట్ జి.శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పర్యటనతో బీఆర్‌ఎస్‌లో గుబులు



కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కార్నర్ మీటింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకుల్లో గుబులు మొదలై అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని తెలిపారు. శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. మంత్రి గంగుల కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుపై అన్ని అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వల్ల లాభపడి అధికారం కోల్పోయి 24గంటలు గడవక ముందే పార్టీ మారిన సునీల్‌రావు కాంగ్రెస్ పార్టీని విమర్శించడమేంటని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని మాట్లాడినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్ నాయక్, దన్నసింగ్, షబానా మహమ్మద్, ఊరడి లత, జీడీ రమేశ్, ఎండీ.చాంద్, మెతుకు కాంతయ్య, మ్యాకల నర్సయ్య పాల్గొన్నారు.

అందరికీ అభయ హస్తం

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన విజయభేరి యాత్ర
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధిక సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, ప్రజలు
- జీవన్‌రెడ్డిని అభినందించిన రాహుల్



జగిత్యాలకు చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/కొత్తపల్లి/మల్యాల: రాహుల్‌గాంధీ విజయభేరి యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. పెద్దపల్లి జిల్లాలో గురువారం మంథని వద్ద ప్రవేశించిన రాహుల్‌గాంధీ యాత్ర.. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మీదుగా నిజామాబాద్ జిల్లాలో ప్రవేశించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం విధానాలను ఎండగడుతూ రాహుల్‌గాంధీ ముందుకుసాగారు. కాంగ్రెస్ కార్యకర్తలను బెబ్బులితో పోలుస్తూ ఉత్సాహం నింపారు. అత్యవసర పనులు ఉండడంతో గంగాధర కార్నర్‌మీటింగ్, కొండగట్టు దర్శనం రద్దయ్యాయి. అయినా.. ఆయా ప్రాంతాల్లో ఎదురుచూస్తున్న స్థానికులను, పార్టీ కార్యకర్తలను పలకరిస్తూ ముందుకుసాగారు.

దోశ వేసిన రాహుల్‌గాంధీ

జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం, నూకపల్లి న్యాక్ బస్టాండ్ వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్‌లో రాహుల్‌గాంధీ దోశ వేశారు. దోశ తింటూ స్థానికులతో ముచ్చటించారు. దంపతులను మాట్లాడించి, వారి పిల్లలకు చాక్లెట్స్ ఇచ్చారు. గౌడసంఘం నాయకులు మోకు అందజేశారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌కు చేరుకోగా.. అప్పటికే అక్కడికి భారీగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. 'రాహుల్ పీఎం..' అంటూ నినాదాలు చేశారు. బస్సు ఎక్కిన రాహుల్‌గాంధీ దాదాపు 36 నిమిషాలపాటు ప్రసంగించారు. జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డిని, ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తన ప్రసంగాన్ని తెలుగులో బాగా అనువదించారని జీవన్‌రెడ్డిని రాహుల్‌గాంధీ అభినందించారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నాయకులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, మాణిక్ రావుఠాక్రే, వేణుగోపాల్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జగిత్యాల నుంచి కోరుట్ల వైపు..

రాహుల్‌కు మేడిపల్లిలో వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ప్రసాదం అందించారు. కోరుట్లలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నర్సింగారావు, కోమటిరెడ్డి కరంచంద్, కృష్ణారావు, సుజిత్‌రావు స్వాగతం పలికారు. కోరుట్ల శివారులోని ముక్క కన్వెన్షన్ సెంటర్‌లో భోజనం చేసి మెట్‌పల్లికి వెళ్లారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేస్తూ ఆర్మూర్ బయలుదేరి వెళ్లారు.

దొంగల బెడద

యాత్రలో కార్యకర్తలకు దొంగల బెడద వెంటాడింది. జగిత్యాలతోపాటు మేడిపల్లిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌లో భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో దొంగలు చేతివాటం ప్రదర్శించారు.

హోటల్ వద్ద సందడి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో గురువారం రాత్రి రాహుల్‌గాంధీ స్థానిక హోటల్-వీ పార్క్‌లో బసచేశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం భారీగా హోటల్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సైతం రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావుఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ హోటల్‌లోనే బసచేశారు. రాహుల్‌ను కలిసేందుకు ఉదయమే ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, రాజయ్య, మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వంశీచందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు స్థానిక నాయకులు హోటల్ వద్దకు వచ్చారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాంతో రాహుల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

'సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్' అంటూ..

హోటల్ ఎదుట చెన్నూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'రాహుల్ గాంధీకి జై.. సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గమనించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వారికి నచ్చజెప్పారు.

సెంచరీ కొడతాం

అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టి అధికారంలోకి వస్తామని నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ బస చేసిన కరీంనగర్‌లోని హోటల్ వీ-పార్క్ వద్దకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రజలు వారిని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ, జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో ముందుగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



జగిత్యాలలో బైక్‌పై వస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మల్యాల వద్ద దోశ తింటూ.. ముచ్చటిస్తూ..



జగిత్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



రాహుల్ గాంధీకి మోకు అందించిన గౌడన్న



కోరుట్లలో రాహుల్ రాకకోసం..

పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- కలెక్టర్ బి. గోపి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

కరీంనగర్‌కార్పొరేషన్: దుర్గామాత నిమజ్జనం, బతుకమ్మ, దసరా పండగలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. గోపి మాట్లాడుతూ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం కోసం మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంటలో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. చెరువుల వద్ద క్రెయిన్‌లు, లైటింగ్, శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. దసరా పండుగ సందర్భంగా రావణదహన కార్యక్రమాలకు ఎన్నికల నియావళి ఉల్లంఘన జరగకుండా ముందస్తు అనుమతిని తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీసు కమిషనర్ ఎల్. సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, అదనపు డీసీపీ (శాంతిభద్రతలు) లక్ష్మీనారాయణ, డీపీవో వీరబుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి లలితదేవి, ఆర్డీఓ కె.మహేశ్వర్, ఏసీపీలు, మున్సిపల్ కమిషనర్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొదలైన ఈవీఎం మొదటి స్థాయి ర్యాండమైజేషన్

కరీంనగర్ అర్బన్: జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలకు మొదటి దశ ర్యాండమైజేషన్‌ను చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటిదశ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని 1338 పోలింగ్ కేంద్రాలలో జరగనున్న ఎన్నికలకు 2,674 బ్యాలెట్ యూనిట్లు, 2089 కంట్రోల్ యూనిట్లు, 2054 వీవీప్యాట్‌లను సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 390, చొప్పదండి 327, మానకొండూర్ 316, హుజూరాబాద్ 305 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, సీయూ, వీవీప్యాట్లను అందించడానికి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటిదశ ర్యాండమైజేషన్‌ను నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. శనివారం ఉదయం అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోడౌన్ తెరిచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలిస్తామని వివరించారు. రెండో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు. సమావేశంలో సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్ నివాసంలో బతుకమ్మ ఆడుతున్న జిల్లా అధికారులు, కలెక్టర్ సతీమణి



బతుకమ్మ సంబరాల్లో కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు, జిల్లా అధికారులు

రామరామరామ ఉయ్యాలో...

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ కల్చరల్: బతుకమ్మ పాటలతో జిల్లా ఉన్నతాధికారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో కలెక్టర్ డా.బి.గోపి దంపతులతోపాటు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దంపతులు, సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ దంపతులు ఆడిపాడారు. డీఆర్డీవో శ్రీలత, డీఎంవో పద్మావతి, సబితాకుమారి, ఇరుమల్ల శారద పాల్గొన్నారు. నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ స్వరూపరాణి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. అదే విధంగా జిల్లాలోని పలు గ్రామాల్లో ఎడొద్దుల సద్దులు ఘనంగా జరిగాయి. తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి పొద్దుపోయేవరకు ఆడిపాడారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో జరిగిన వేడులకల్లో మంత్రి కమలాకర్ ప్రముఖులు పాల్గొన్నారు.



ఆసిఫ్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునుగుడే

- రాహుల్‌గాంధీ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివారు
- ఆరు గ్యారంటీలు ఉత్తవే
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునుగుడే అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో మాట్లాడుతూ.. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కర్ఫ్యూలు, కులమత ఘర్షణలు, ముఖ్యమంత్రుల మార్పులు తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటన పేలవంగా సాగిందని, పోటీ చేసే అభ్యర్థులు లేకుండా కార్నర్ మీటింగ్‌లు పెట్టుకునే దుస్థితి రావడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివారని, అగ్రనేతలతో అసత్యాలు పలికించడం ఇక్కడి కాంగ్రెస్ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు అనేక కొర్రీలు పెడుతోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేసి చూపించాలని సవాల్ విసిరారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల్లో అమలు చేయని హామీలను తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు తెరమీదకు తీసుకురావడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుంటే ఒక్కోచోట ఒక్కో తీరు మేనిఫెస్టో ప్రకటించడం వారి మోసపూరిత కుట్రకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ వెనుకబాటుకు కాంగ్రెస్ పార్టీయే కారణమన్నారు. ఆ పార్టీ 2018 ఎన్నికల్లో ఇలాంటి హామీలే ఇస్తే ప్రజలు తిరస్కరించారని, తాజాగా ఆరు గ్యారంటీ స్కీంలను చెత్తబుట్టలో వేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

• బకాయిలు చెల్లించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నాలుగు నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బీఆర్‌టీయూ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆఫీస్ ఎదుట బైఠాయించి, నినాదాలు చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని కమిషనర్ ఇచ్చిన హామీ మేరకు ఆందోళన విరమిస్తున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దావు రాజమల్లయ్య, నగర అధ్యక్షుడు గడ్డం సంపత్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ నాయకులు మైస తిరుపతి, లింగయ్య, రాజేశ్వరి, పద్మ, చంద్రకళ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

'ద్విదశాబ్ది' సంబురం

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల ద్విదశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రారంభించి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్సవాన్ని కళాశాల డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మెడికల్ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. మెడికోలు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు సూచించారు.





వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

క్లుప్తంగా

'శ్రీచైతన్య' అధ్యాపకుడికి డాక్టరేట్



తిమ్మాపూర్(మానకొండూర్): శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ విభాగం అధ్యాపకుడు ఎస్.ఉదయ్‌కుమార్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ఉదయ్‌కుమార్ హ్యూమన్ రిసోర్స్ యాక్షన్ ఏరియాస్ ఇన్ పవర్ సెక్టార్ ఆర్గనైజేషన్ – ఎ స్టడీ ఆఫ్ సెలెక్ట్ యూనిట్స్ అనే అంశంపై డాక్టర్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉదయ్‌కుమార్‌ను అభినందించారు. డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రసాద్ రాజు, విభాగాధిపతులు, పాలనాధికారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపంలో అన్నదానం



తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలో శుక్రవారం విఘ్నేశ్వర మహిళా కమిటీ, ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం పోలు రాము, రమేశ్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదర్శ యూత్‌వారు వారిని సత్కరించారు. యూత్ అధ్యక్షుడు వడ్లకొండ మల్లయ్య, విఘ్నేశ్వర మహిళా కమిటి సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన సతీశ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ శివారులో ఆటో బోల్తా పడి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని చింతలపల్లికి చెందిన దున్నపోతుల సతీశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆటోలో సింగాపూర్ గ్రామం వైపు వెళ్తుండగా అదుపుతప్పి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు పాటించని వైన్స్‌పై చర్య తీసుకోవాలి

కరీంనగర్: జిల్లా కేంద్రంలో ఉదయం 6 గంటలకే మద్యం విక్రయిస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. నిబంధనలు పాటించని వైన్స్, బార్‌లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వైన్స్, బార్‌ల ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

14 మంది బైండోవర్

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని 14 మందిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ రజని ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా పలు గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులను బైండోవర్ చేశామన్నారు.

నగదుపై నిఘా!

- ఐదు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు
- ఇప్పటివరకు రూ.3 కోట్లకు పైగా పట్టివేత
- లిక్కర్, ఇతరత్రాల సరఫరాపై ప్రత్యేక నజర్



నగదు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుబ్బారాయుడు (ఫైల్)

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాకు వచ్చేమార్గాల్లో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అణువణువూ గాలిస్తున్నారు. హైదరాబాద్ దారిలో రేణికుంట టోల్‌ప్లాజా వద్ద, పెద్దపల్లిమార్గంలో మొగ్దుంపూర్‌లో, జమ్మికుంట వైపు సిరిసేడులో, వరంగల్ రూట్‌లో పరకాల ఎక్స్‌రోడ్ వద్ద, మంచిర్యాల రూట్‌లో ఆర్నకొండ వద్ద ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో చెక్‌పోస్టులో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారి, ఎస్సై, ఐదుగురు కానిస్టేబుల్‌లు, ఎక్సైజ్‌శాఖ నుంచి ఒకరు, అటవీశాఖ నుంచి ఒకరు, రవాణాశాఖ నుంచి ఒకరు 24 గంటల పాటు విధుల్లో కొనసాగుతున్నారు.

నిత్యం పర్యవేక్షణ

జిల్లావ్యాప్తంగా తనిఖీల్లో పట్టుబడిన నగదు ఇప్పటికే రూ.3 కోట్లు దాటినట్లు పోలీసులు వెల్లడించారు. కరీంనగర్ టూటౌన్ పరిధిలో 16వ తేదీన ఒకేసారి రూ.2.36 కోట్లు పట్టుబడింది. చెక్‌పోస్టుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితోపాటు ఉన్నతాధికారులు, ఎన్నికల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల వేళ డబ్బు, మద్యం, ఇతరత్రాలను కట్టడి చేసేందుకు క్షుణ్ణంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు.

రూ.1.32 లక్షలు పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టూటౌన్ పరిధిలోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా రూ.1.32 లక్షలు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం గుంటూరుపల్లి గ్రామానికి చెందిన అనిల్ తన బైక్‌పై రూ.1.32 లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాటికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

తనిఖీలు చేపడుతున్నాం

ఎన్నికల కోడ్ మేరకు వాహన తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నాం. వాహనాల్లో తగిన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్‌చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా ఐదు చెక్‌పోస్టుల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయి. – ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ సీపీ

కాంగ్రెస్ చరిత్ర మోసాల పుట్ట

- పేలవంగా సాగిన రాహుల్‌గాంధీ పర్యటన
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటన జిల్లాలో పేలవంగా సాగిందని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివారని మేయర్ వై.సునీల్‌రావు విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ చరిత్ర మోసాల పుట్ట అని, 130 ఏళ్ల ఆ పార్టీ వల్ల తెలంగాణకు ఒరిగింది శూన్యమన్నారు. కుట్రలకు తెరలేపి, ఏడాదికో ముఖ్యమంత్రి చొప్పున ఐదేళ్లలో ఐదుగురు ముఖ్యమంత్రులను మార్చిన నీచ సంస్కృతి కాంగ్రెస్‌దని మండిపడ్డారు. జిల్లాలో ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారని అన్నారు. పదేళ్లలో తెలంగాణ అభివృద్ధి చూసి, దేశమే అబ్బురపడుతోందని పేర్కొన్నారు. జిల్లా నుంచి ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు చనిపోతే ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీలో ఉంచకుండా హైదరాబాద్ తరలించారని తెలిపారు. తెలంగాణ తొలి, మలి దశ పోరాటాల్లో బలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పక్కా తెలంగాణ వ్యతిరేకి అని, బీఆర్‌ఎస్‌ను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ విజయదుందుబి మోగించడం ఖాయమన్నారు. కార్పొరేటర్లు, నాయకులు వాల రమణారావు, నేతికుంట యాదయ్య, గందె మాధవి, దిండిగాల మహేశ్, కాశెట్టి శ్రీనివాస్, కోల మాలతి, పిట్టల వినోద, శ్రీదేవి, లెక్కల స్వప్న, కరీం, అనిల్, బాలు, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీతోనే మార్పు సాధ్యం

- పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

మానకొండూర్: రాష్ట్రంలో బీజేపీతోనే మార్పు సాధ్యమని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. మానకొండూర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మద్దతుతోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని, కాంగ్రెస్ హోల్‌సేల్‌గా బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయే పార్టీ అని ఎద్దేవా చేశారు. బీజేపీ కార్యకర్తలు బూత్ స్థాయిలో ఎన్ని ఓట్లు సాధిస్తారో ముందుగా లెక్కలు వేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎంతమంది దళితులు దళిత బంధుకు అర్హులో, ఇప్పటివరకు ఎంత మందికి ఈ పథకం వర్తింపజేశారో ఎమ్మెల్యే రసమయి చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు, నాయకులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, దండు కొమురయ్య, సమ్మిరెడ్డి, ముత్యాల జగన్‌రెడ్డి, రాపాక ప్రవీణ్, జగదీశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి

హుజూరాబాద్: బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో, మాయమాటలతో నమ్మించి మోసం చేయడం సీఎం కేసీఆర్‌కు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కోవడానికి అంతర్గత ఒప్పందాలతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులు 40 రోజులు కష్టపడి పనిచేసి, భారీ మెజారిటీని సాధించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, జిల్లా అధికార ప్రతినిధులు సుధాకర్, మసాడి ముత్యంరావు, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, రూరల్ అధ్యక్షులు సంపెల్లి సంపత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.6,850



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌యార్డులో కొత్తపత్తి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,850 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 17వాహనాల్లో 368 క్వింటాళ్ల పాతపత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,150 పలికింది. 28వాహనాల్లో 205క్వింటాళ్ల కొత్తపత్తిని తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,850, మోడల్ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.6,600కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా దసరా సందర్భంగా మార్కెట్‌కు నాలుగురోజులు సెలవులు ఉంటాయని, బుధవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్ క్రైం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ సుబ్బారాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. కరీంనగర్ టూటౌన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి రెండు వేర్వేరు బైక్‌లపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. విచారణలో వారికి ఎలాంటి పరిచయం, కక్షలు లేవని అనుకోకుండా ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. అక్కడే ఉన్న కొంతమంది గుమిగూడి, ప్రమాదానికి కారణమంటూ ఆ ఇద్దరిలో ఒకరిపై ఇష్టారీతిన దాడి చేశారన్నారు. అతని మోటార్ సైకిల్‌ను తగులబెట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక పోలీసులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి, వారిని నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వినకుండా దుర్భాషలాడుతూ, విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యులపై మూడు కేసులు నమోదు చేశామన్నారు. విచారణ కొనసాగుతోందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నర్సమ్మ (ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం ఎల్లంపల్లికి చెందిన ఆరుముళ్ల నర్సమ్మ(106) శుక్రవారం వయోభారంతో బాధపడుతూ మృతిచెందింది. గోదావరి నదిపై రైలువంతెన నిర్మించిన సమయంలో తన వయస్సు ఆరేళ్లు అని తన కూతురు పుష్పలత ఇంట్లో ఇటీవల జరిగిన శుభకార్యానికి హాజరైన సందర్భంగా వృద్ధురాలు తెలిపింది. ఇప్పటిదాకా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వృద్ధురాలు వయోభారంతో మృతిచెందడంపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భర్త పోశయ్య 50 ఏళ్ల క్రితమే మృతిచెందాడు. వారికి ఒకే ఒక కూతురు ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధి గంజ్ ప్రాంతంలోని డ్రైనేజీ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. అతని వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరి సంబంధీకులైనా కనిపించకుండా పోతే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు ఏజీపీల నియామకం

కరీంనగర్‌క్రైం: జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాదిగా కే.వీ.వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా లెంకల రాంరెడ్డి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముచ్చంపేటకు చెందిన వేణుగోపాల్‌రావు జిల్లాకోర్టులో 29 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తిమ్మాపూర్ మండలం వచ్చునూరుకు చెందిన రాంరెడ్డి జిల్లాకోర్టులో 28 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. వీరు ప్రభుత్వ న్యాయవాదులు గా మూడేళ్ల పదవిలో కొనసాగనున్నారు.

యువకుడి ఆత్మహత్య

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి కథనం ప్రకారం.. పట్టణంలోని గాజులపేటకు చెందిన ఎక్కల్‌దేవి విశాల్(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొంతకాలంగా ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేస్తూ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విశాల్‌కు గత మార్చిలో వివాహమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అవ్వా.. నీ ఓటు బీఆర్‌ఎస్‌కే వెయ్

- కొత్తపల్లిలో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యుల ప్రచారం



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి సతీమణి రజిత

కొత్తపల్లి(కరీంనగర్): మూడుసార్లు ఎమ్మెల్యే గెలిచి, కరీంనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మంత్రి గంగుల కమలాకర్‌ను నాలుగోసారి గెలిపించాలని ఆయన కుటుంబసభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కొత్తపల్లి పట్టణంలోని 12, 1, 6, 5వ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు అడిగారు. దారిలో ఓ వృద్ధురాలు కనిపిస్తే అవ్వా.. నీ ఓటు బీఆర్‌ఎస్ పార్టీకే వెయ్.. అంటూ మంత్రి సతీమణి రజిత అభ్యర్థించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు వాసాల రమేశ్, జేరిపోతుల మొండయ్య, ఎం.వేణుగోపాల్, గందు రాంబాబు, ఎస్కే.నజియాబాబా, వేముల కవిత, కో–ఆప్షన్ సభ్యులు కట్ల మమత, వ్యాపారవేత్త గంగుల సుధాకర్, కుటుంబసభ్యులు గీతమ్మ, శారద, రుద్ర రాధ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని బట్టపల్లికి చెందిన కొక్కుల సురేశ్‌కు విద్యుత్ చౌర్యం కేసులో న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఉమ్మడి జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సురేశ్ తన ఇంటికి విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగించాడు. అతన్ని పట్టుకున్న అధికారులు మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించి వదిలేశారు. సురేశ్ రెండోసారీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన అధికారులు, అతన్ని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ ఎదుట సురేశ్‌ను హాజరుపర్చగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో జడ్జి అతనికి రూ.83,390 జరిమానా చెల్లించాలని లేదంటే ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై టి.నరేశ్, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



మాట్లాడుతున్న డాక్టర్ నగేశ్

విద్యానగర్(కరీంనగర్): అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించుతామని తెలిపారు. సాధారణ ప్రజానీకానికి ఏమీ చేయని మంత్రి గంగుల కమలాకర్‌ను ప్రజలు మరోసారి ఎలా ఆశీర్వదిస్తారని ప్రశ్నించారు. మైనారిటీల భూములు ఆక్రమించుకున్న చరిత్ర గంగులదని ఆరోపించారు. రేకుర్తిలోని మైనారిటీల ఇళ్లను కూలగొట్టించినందుకు ప్రశ్నిస్తే కేసులు పెట్టించిన ఘనాపాటి అని మండిపడ్డారు. మెజారిటీ ప్రజలు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని, నామినేషన్ల ప్రక్రియ తర్వాత తమ పార్టీ అధినేత షర్మిల రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన శిక్షణ అధికారుల పర్యటన



గట్టుభూత్కూర్‌లో శిక్షణ అధికారులకు సన్మానం



ఆముదాలపల్లిలో..

గంగాధర(చొప్పదండి): మండలంలోని గట్టుభూత్కూర్‌లో కేంద్ర శిక్షణ అధికారుల పర్యటన శుక్రవారం ముగిసింది. ఐదు రోజులుగా గ్రామంలో ఉంటూ అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రం పనితీరును పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, నర్సరీ, మొక్కలు, ప్రకృతి వనాల పెంపకం వివరాలు తెలుసుకున్నారు. శిక్షణ ముగింపు సమావేశంలో వారు మాట్లాడుతూ.. గట్టుభూత్కూర్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాసారపు శైలజ, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆముదాలపల్లిలో...

శంకరపట్నం(మానకొండూర్): గ్రూప్–1 శిక్షణ అధికారులను ఆముదాలపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం సన్మానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరుపై గ్రామంలో నాలుగు రోజులు అధ్యయనం చేశారని సర్పంచ్ మానప తెలిపారు. చివరి రోజు వారిని సత్కరించినట్లు పేర్కొన్నారు. ఉపసర్పంచ్ జంపయ్య, ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీదే అధికారం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: రాష్ట్రంలో మూడోసారీ బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రాజీనామా తర్వాత రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. నియోజకవర్గంలోని 106 గ్రామాల్లో మహిళా సంఘాలు, కుల సంఘాల భవనాలు, రోడ్లు నిర్మించామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టిన, రూ.37 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. తాజా మేనిఫెస్టోతో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సెంచరీ కొడుతుందన్నారు. బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రన్ అవుట్ కాబోతున్నాయని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం కోసం ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసుకున్నానని, గెలిపిస్తే సిద్దిపేటలా మారుస్తానని తెలిపారు. మేనిఫెస్టో అమలు చేయకపోతే అంబేడ్కర్ చౌరస్తాలో ముక్కు భూమికి రాస్తానన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు మారేపల్లి సుశీల, ముక్క రమేశ్, కొండ్ర నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గాదేవికి పల్లకి సేవ

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో శ్రీదేవి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు మంగళహారతులతో స్వాగతం పలికారు. దుర్గామాత దీక్షాస్వాములు భజనలు, నత్యాలు చేశారు. కార్యక్రమంలో మహాత్మానగర్ సర్పంచ్ జక్కని శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.